క్లుప్తంగా

మాజీ మునసబుకు ఘననివాళి



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని మాజీ మునసబు బుర్రి పీరారెడ్డి(75) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. దీంతో సమాచారం తెలుసకున్న గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మంగళవారం బుర్రి పీరారెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయనవెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, కరాలపాడు సర్పంచ్ చల్లా శివారెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బుర్రి వెంగళరెడ్డి, యూత్ కన్వీనర్ మందా సుధీర్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పాలన



వెల్దుర్తి : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పరిపాలన అందిస్తున్నామని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వెల్దుర్తిలో మంగళవారం వెల్దుర్తి–శిరిగిరిపాడు సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలో రూ.3.04 కోట్లతో సీసీ రోడ్లను నిర్మించడం జరుగుతుందన్నారు. వెల్దుర్తిలో రూ.50లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం జరిగిందన్నారు. కూటమి నాయకులు జూలకంటి చిరంజీవిరెడ్డి, కుర్రి శివారెడ్డి, పంచాయతి రాజ్ ఏఈ పాశం శ్రీనివాసరెడ్డి తదితరులున్నారు.

నేత్ర వైద్యశిబిరం



మాచవరం: మండల కేంద్రమైన మాచవరంలోని షాదీఖానాలో డాక్టర్ రామలింగారెడ్డ మాక్స్ విజన్ కంటి హాస్పటల్ వారి సహకారంతో బుధవారం ఉచిత కమిటీ వైద్యశిబిరం నిర్వహించారు. ఈవైద్యశిబిరంలో సుమారు 140 మంది వరకు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. ఆరోగ్య శ్రీ కార్డు, హెల్త్ కార్డు ఉన్న వారికి కంటి ఆపరేషన్లను ఉచితంగా నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. ఆపరేషన్ చేయించుకునేవారికి ఉచితంగా రవాణా సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఉచిత వైద్యశిబిరంలో ఆపరేషన్ అవసరం లేని వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆపరేషన్ అవసరమైన వారికి నర్సరావుపేటలోని రామలింగారెడ్డి మాక్స్ విజన్ సూపర్‌స్పెషాలిటీ కంటి వైద్యశాలకు రావాలని సూచించారు.

ఉత్తమ హోంగార్డుగా సుభాని



ముప్పాళ్ళ: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న హోంగార్డు ఎస్.సుభాని జిల్లా ఉత్తమ హోంగార్డుగా ఎంపికయ్యారు. ఆ మేర నరసరావుపేటలోని ఎస్పీ కార్యాలయంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా పల్నాడు జిల్లా ఎస్పీ కే శ్రీనివాసరావు చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. హోంగార్డు సుభాని గత 20 సంవత్సరాలుగా మంచినీటి చలివేంద్రం నిర్వహణతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. దీంతో పాటుగా విధి నిర్వహణపై బాధ్యతా యుతంగా పనిచేస్తున్నందుకు గాను అభినందిస్తూ అవార్డు అందించారు. ఈ సందర్భంగా సుభానిని ఎస్సై యు.సోమేశ్వరరావు, స్టేషన్ సిబ్బంది అభినందించారు.

బీరువా, కుర్చీలు అందజేత

పెదకూరపాడు: పెదకూరపాడు జెడ్పీ పాఠశాలకు కొన్నిపాటి వెంకట గంగాధరరావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి భారతి సంక్రాంతి పండగ పురస్కరించుకొని పాఠశాలకు బీరువా, కుర్చీలు, కళావేదికపై మ్యాట్, కర్టన్లు అందించారు. 1989–90 బ్యాచ్ కృష్ణమనేని లలిత బాబు సహకారంతో పమిడాల వెంకటరావు, కరణం వెంకటేశ్వర్లు, కూరపాటి శ్రీనివాసు, శ్రీరామినేని సుధీర్, ఉన్నవ సాయి ఈ సామగ్రిని అందించారు.

సంక్రాంతి సంబరం..ఆనందం అంబరం

- వాడవాడలా సంక్రాంతి సంబరాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- కనుమ నాడు పశువులకు పూజలు

గురజాల: వీధుల్లో అందమైన రంగవల్లులు.. ప్రతి ఇంటా పిండి వంటల ఘుమఘుమలు.. గొబ్బెమ్మలకు పూజలు.. ఆటపాటల పోటీలు.. గోమాతకు ప్రత్యేక పూజలతో ప్రతిచోటా సంక్రాంతి సంబరం అంబరాన్ని తలపించింది. మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి, కనుమ వేడుకలను పురస్కరించుకుని వారి వారి ఇష్టదేవతలకు నైవేద్యం సమర్పించారు. తెలుగువారి అతిపెద్ద పండుగ కావడంతో ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం వేర్వేరు చోట్ల ఉన్నవారంతా తమ సొంత ఊళ్లకు చేరుకుని బంధుమిత్రుల మధ్య సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకొన్నారు. పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురజాలలోని భద్రాద్రి వేలాది లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవాలయంలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండుగలను పురస్కరించుకుని ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ జగదీష్ అధ్వర్యంలో సీఐ, ఎస్‌ఐలు, సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు.

దాచేపల్లిలో...

దాచేపల్లి: మండలంలో సంక్రాంతి పర్వదినం వేడుకలు మంగళవారం కనులపండువగా జరిగాయి. దాచేపల్లి నగర పంచాయతీతో పాటుగా గ్రామాల్లో ఉన్న పలు దేవాలయాల్లో సంక్రాంతి పూజ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జామునుంచే భక్తులు దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు. పలు దేవాలయాల్లో స్వామివారి శాంతి కల్యాణాలు జరిపించి ఉత్సవమూర్తులను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా దాచేపల్లి, గామాలపాడు, పెదగార్లపాడులలో కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గామాలపాడు, దాచేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు డాక్టర్ కర్నాటి వరలక్ష్మి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.



జంగమహేశ్వరపురంలోని స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

రెంటచింతలలో...

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకొన్నారు. భక్తులు వేకువ జామునుంచే రెంటచింతలలోని సుబ్బన్నతోట కాలనీలోని అలివేలుమంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో, శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో, శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మిట్టగుడిపాడు గ్రామంలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు వడ్లమాను రమణాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. రెంటాల గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సహిత చెన్నకేశవస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు సన్నిగండ్ల గోపాలాచార్యులు నేతృత్వంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెంటాల గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ చెన్నకేశవస్వామి, భీమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.



రెంటచింతలలో హరిదాసుకు ధాన్యం అందజేస్తున్న దంపతులు

పిడుగురాళ్లలో...

పిడుగురాళ్ల: మకర సంక్రాంతి పండగను బుధవారం వైభవంగా నిర్వహించుకున్నారు. సంక్రాంతి పండగ అంటేనే పెద్దపండగ. ఈ పండగను మూడు రోజుల పాటు ప్రజలు సంతోషంగా నిర్వహించుకున్నారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటి ముందు రకరకాల ముగ్గులు వేసి అలంకరించారు. హరిదాసులు సంక్రాంతి సంబరాల్లో ప్రత్యేకంగా నిలిచారు. పశువులను ప్రత్యేకంగా అలంకరించి పూజించారు.



రెంటచింతలలో ప్రత్యేక పూజలు అందుకుంటున్న అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి



దాచేపల్లిలో స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం



పిడుగురాళ్లలో ఓ వీధిలో సంక్రాంతి ముగ్గుల సందడి

‘బలమైన సాధనాలుగా వాడబడాలి’

దాచేపల్లి: యువత బలవంతుని చేతిలో బాణము వంటి వారని, దేవుని చేతిలో బలంగా వాడబడాలని ఏఈఎల్‌సీ యూత్ డైరెక్టర్ రెవ.డాక్టర్ గనుపల్లి సతీష్‌బాబు అన్నారు. మండలంలోని కేసానుపల్లి క్రీస్తు లూథరన్ దేవాలయంలో పల్నాడు జిల్లాస్థాయి యువకుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం నిర్వహించారు. వివిధ సంఘాల నుంచి వచ్చిన యువకులతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. బైబిల్‌లోని దానియేలు గ్రంథంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం వ్యాచరచన పోటీలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి సతీష్‌బాబు మాట్లాడారు. స్థానిక సంఘ కాపరి రెవ. జీఎస్‌పీ. కుమార్, కౌన్సిల్ మెంబర్ మాచర్ల మోజెస్, డేలిగేట్స్ వినుకొండ బాబు, శ్రీపతి కాశయ్య పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూత్ డైరెక్టర్ డాక్టర్ సతీష్‌బాబు

పేదలకు నిత్యావసరాలు పంపిణీ

మాచర్ల: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల, లవ్ అండ్ ఆఫ్ ఆనందవిహారి గ్రూప్, పల్స్ పోలియో ప్రోగ్రాం గ్రూప్ అందరూ కలిసి సమాజానికి దూరంగా జీవిస్తూ, బడుగు వర్గాలుగా ఉన్న శరీన్ (లెప్రసీ) కాలనీలో గల కుటుంబ సభ్యులందరికీ అందరికీ 300 కిలోల బియ్యం, 50 కిలోల కందిపప్పు అందించడం జరిగింది. సమాజంలోని అన్ని వర్గాలతో పాటుగా వీరు ఆనందంగా సంక్రాంతి పండుగను జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కొండవీటి కృష్ణకుమారి, సెక్రటరీ నిమ్మగడ్డ సురేఖ, డెప్యూటీ గవర్నర్ కొండవీటి రామకోటయ్య, మాజీ అసిస్టెంట్ గవర్నర్ ఇక్కుర్తి శంకర్, వీరికి నిత్యవసర సరుకులను అందించడం జరిగింది. కార్యక్రమంలో తుమ్మల సత్య ప్రసాద్, ఆలేటి కోటేశ్వరరావు నాగార్జున రెడ్డి, సాంబశివరావు, మస్తాన్ వలి, అడ్మిన్ డైరెక్టర్ పఠాన్ నాగూర్ వలి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఈ గుంతలకు మోక్షం ఎన్నడో..!



జానపాడుకు వెళ్లే దారిలో గుంతలమయంగా ఉన్న రహదారి

పిడుగురాళ్ల: సంక్రాంతి పండకు వచ్చే బంధువులు, స్థానికులకు ఎక్కడా ఒక గుంత కూడా కనిపించకుండా రోడ్లు వేస్తామని కూటమి నేతలు ఆర్భాటంగా ప్రకటించారు. అయితే పండుగ వచ్చింది.. వెళ్లింది.. కానీ పిడుగురాళ్ల పట్టణం నుంచి జానపాడుకు వెళ్లే దారిలో ఆక్స్‌ఫర్డ్ సమీపంలో గుంతలకు మాత్రం మోక్షం కలగలేదు. గతంలో ఈ గుంతలు బాగా ఎక్కువగా ఉండటంతో వర్షాకాలంలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారే ఉద్దేశ్యంతో గతంలో చింతలపూడి చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ గుంతలను పూడ్చివేశారు. అయితే ఈ గుంతలకు శాశ్వత మరమ్మతులు చేయాల్సిన అధికారులు మిన్నుకుండడంతో మళ్లీ గుంతలు దర్శనమిస్తున్నాయి. ఇతర గ్రామాల నుంచి స్వగ్రామానికి వచ్చే ప్రజలకు ఒక గుంత కూడా కనిపించకూడదని, ఆ గుంతలు కనిపిస్తే స్థానిక ప్రజాప్రతినిధులదే బాధ్యతని, సీఎం నారా చంద్రబాబునాయుడు బహిరంగంగా చెప్పినా, పట్టణ సమీపంలోని జానపాడు రోడ్డు సమీపంలోని గుంతలకు మాత్రం మోక్షం కలగలేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి గుంతలను పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

‘తిరుమల ఆక్స్‌ఫర్డ్’లో ఉత్తమ బోధన

పిడుగురాళ్ల: తమ విద్యాసంస్థ విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చేంతవరకు తమ ఉపాధ్యాయ బృందం బాధ్యతగా వ్యవహరిస్తారని వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని తిరుమల ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ... తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల్లో చేరిన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి ఉత్తమ ఫలితాలు సాధించటంతోపాటు ఉన్నత విద్యను కూడా విద్యార్థులు అందించే విధంగా విద్యా సంస్థ అధ్యాపకులు కృషి చేస్తున్నారన్నారు. అలాగే తెలుగు సాంప్రదాయానికి ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండుగ గురించి విద్యార్థులకు తెలియజేశారు. తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

రేపు తురకపాలెం చర్చి 122వ వార్షిక తిరునాళ్ల

తురకపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని తురకపాలెం గ్రామంలోని పునీత పాదువాపురి ఆంతోని దేవాలయ 122వ వార్షిక తిరునాళ్ల ఈ నెల 17వ తేదీన జరుగుతుందని చర్చి విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ నాగోతు చిన్నయ్య బుధవారం తెలిపారు. దాదాపు 122 సంవత్సరాల చరిత్ర గల ఈ చర్చి వార్షిక తిరునాళ్లను ప్రతి ఏడాది జనవరి 17న నిర్వహించటం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. ప్రత్యేకంగా ఆలయ ఆవరణలో మట్టితో నిర్మించిన లూర్దుమేరిమాత విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ సందర్భంగా ఉదయం ప్రత్యేక ప్రార్థనలు, సాయంత్రం గ్రామంలో తేరు ప్రదక్షిణ జరుగుతుందన్నారు.

జేసుతిరు హృదయ స్వరూప ప్రతిష్ట నేడు

పునీత ఆంతోని చర్చి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఈ నెల 16వ తేదీన 25 అడుగుల ఎత్తైన జేసుతిరు హృదయ స్వరూప ప్రతిష్ట మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు మద్దినేని శౌరయ్య, సర్పంచ్ మల్లవరపు చంద్రశేఖర్ ప్రతాప్‌లు తెలిపారు. గ్రామ ప్రారంభంలో గల ప్రదేశంలో ఉదయం 8.30 గంటలకు స్వరూప ప్రతిష్ట, ఆశీర్వాద పూజ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి గుంటూరు బిషప్ చిన్నాబత్తిన బాగ్యయ్య, విజయవాడ బిషప్ తెలగతోటి రాజారావులు హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.



విద్యుత్ వెలుగుల్లో పునీత ఆంతోని దేవాలయం

ముగ్గుల పోటీలకు విశేష స్పందన



విజేతలకు బహుమతులు అందిస్తున్న సీఐ బ్రహ్మయ్య



రెంటచింతల ఉట్లస్తంభాల సెంటర్‌లో నిర్వహించిన పోటీలో పాల్గొన్న మహిళలు

గురజాల: ముగ్గుల పోటీలకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. మండల పరిధిలోని గోట్టిముక్కల గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా గ్రామ పెద్దల సహకారంతో మంగళవారం సాయంత్రం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 102 మంది ముగ్గుల పోటీలకు, 60 మంది కుర్చీల పోటీలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన విజేతలకు సీఐ ఆవుల భాస్కర్, ఎస్‌ఐ వినోద్‌కుమార్‌లు పాల్గొని బహుమతులు అందించారు. పోటీల్లో పాల్గొని మంచి ప్రతిభ కనబరచిన మహిళలకు కన్సొలేషన్ బహుమతులు అందించారు. రావిపాటి రవికుమార్, రొండి పెద్ద పాలు రాజు, నాగేంద్రబాబు, పోతురాజు, రావిపాటి కోటేశ్వరరావు, అమర్, నాగరాజు, జె.వెంకటేష్ తదితరులున్నారు.

రెంటచింతలలో...

రెంటచింతల: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని రెంటచింతల ఉట్లస్తంభాల సెంటర్లో, రేగులమాన్యం కాలనీలో, తుమృకోట గ్రామంలో నిర్వహించిన రంగవల్లిలు, డాన్స్‌బేబి డ్యాన్స్, కోలాటం, కుర్చీలాట, తాడాటలలో పోటీలు కోలాహలంగా జరిగాయి. ఈ పోటీలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగవల్లి పోటీలలో అనేక రకాల ముగ్గులను వేసి ఆకట్టుకున్నారు. శ్రీ రామకృష్ణ సేవామండలి అధ్యక్షుడు గుంటక కాశిరెడ్డి మాట్లాడుతూ ఏ రంగంలో ఉన్నా మన మూలాలు మరువకూడదన్నారు. అనంతరం విజేతలైన సబ్బినేని రజిని, వెన్నా యశస్విని, పిడుగు అనుజ్ఞ తులసి, రాజేశ్వరిలకు నిర్వాహకులు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు పంపిణీ



బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులు

నకరికల్లు: సంక్రాంతి పురస్కరించుకొని మండలంలోని నర్సింగపాడు గ్రామంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ క్రీడాపోటీలు ఘనంగా ముగిశాయి. నకరికల్లు, రాజుపాలెం రెండు మండలాల స్థాయిలో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో 30 జట్ల క్రీడాకారులు తలపడ్డారు. ఆరురోజుల పాటు నిర్వహించిన పోటీలలో విజేతలకు మంగళవారం బహుమతులు పంపిణీ చేశారు. ఓవరాల్ విజేతగా ఇనిమెట్లకు చెందిన నూర్‌బాషా సిద్దయ్య, నూర్‌బాషా ఫాజిల్‌లు నిలవగా రూ.10 వేల నగదు బహుమతిని మారం రామలక్ష్మి జ్ఞాపకార్థం అందజేశారు. ద్వితీయ స్థానంలో నర్సింగపాడు గ్రామానికి చెందిన పోతులూరి కాశీచారి, సునీల్ నిలవగా రూ.7 వేల బహుమతిని ఏ.ఆర్.మిల్క్ ప్రొడక్ట్స్ వారు అందజేశారు. మూడో స్థానంలో నిలిచిన ఇనిమెట్ల గ్రామానికి చెందిన షేక్ మహ్మద్‌జానీ, షేక్ మస్తాన్‌వలి రూ.5 వేల బహుమతిని ఎన్.ఎస్.పి. యూత్ వారు అందజేశారు. నాలుగో స్థానంలో నర్సింగపాడు గ్రామానికి చెందిన శ్రీను, ఖాదర్‌లు నిలవగా రూ.3 వేల బహుమతిని ఎన్.ఎస్.పి. యూత్ వారు అందజేశారు.

వైభవంగా మకర జ్యోతి దర్శనం



అయ్యప్ప స్వామి దేవాలయంపై కనిపించిన మకర జ్యోతి

పిడుగురాళ్ల: మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని అయ్యప్పస్వామి దేవాలయంలో మకర జ్యోతి దర్శనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పిడుగురాళ్ల పట్టణ సమీపంలోని అయ్యప్ప స్వామి దేవాయలంలో బుధవారం మకర సంక్రాంతి సందర్భంగా మకర జ్యోతి దర్శనం కోసం భక్తులు విశేషంగా హాజరై మకర జ్యోతి దర్శనం చేసుకున్నారు. తొలుత అయ్యప్ప స్వామి పడిమెట్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పూజారులు, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

దుప్పట్లు పంపిణీ

దాచేపల్లి: నిరుపేదలకు అండగా ఉండాలని నవ సమారిటన్ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు జి.బుల్లయ్య అన్నారు. నడికుడి రైల్వేస్టేషన్ సమీపంలోని 50మంది పేదలకు దాతలు పసుమర్తి వేణు, కనమర్లపూడి గాంధీ, అంబటి శ్రీనివాసరావు, కోట సాయికుమార్, పసుపులేటి సైదారావు, జీవన్ సహకారంతో దుప్పట్లను ఉచితంగా బుధవారం పంపిణీ చేశారు. తమ సంస్థ ద్వారా నిరుపేదలకు విద్య అందించటంతో పాటుగా పలు సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బుల్లయ్య చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

యాచకులకు అన్నదానం

మాచర్ల: కనుమ పండగ సందర్భంగా స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్టు మాచర్ల ఆధ్వర్యంలో బుధవారం మాచర్ల ఆర్టీసీ బస్టాండ్ వద్ద యాచకులకు, వృద్ధులకు, అనాధలకు ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి అన్నదానం చేశారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో కార్యక్రమం చేసినట్లు ఆయన తెలిపారు.

రేకుల షెడ్లు కూల్చివేతపై కేసు

పిడుగురాళ్ల: రేకుల షెడ్డులు కూల్చివేతపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ శివనాగరాజు బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు... మంగళవారం రాత్రి పట్టణ సమీపంలోని కొండమోడు వద్ద మేరిమాత విగ్రహం సమీపంలో ఉన్న రేకుల షెడ్డులను కాంట్రగుంట రవి, మరికొంత మంది కలిసి కూల్చివేశారని ఆనందరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయటం జరిగిందన్నారు. 2024 డిసెంబర్ నెలలో ఇదే ప్రాంతంలో షల్టర్ నిర్మించుకుని ఉంటే ఆనందరావు వాటిని తొలగించి రేకుల షెడ్డులు వేసుకున్నాడని గతంలో ఫిర్యాదు చేసి ఉన్నారని ఎస్ఐ పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

రెంటచింతల: మండలంలోని తుమృకోట గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలైన ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నల్లబోతుల రిషివర్ధన్, తోట లింగయ్య, షేక్ బాబర్‌వలి, షేక్ రహమాన్‌లు రెండు ద్విచక్రవాహనాలపై ఎదురెదురుగా వేగంగా వస్తూ బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలుకాగా వారిని వెంటనే మాచర్ల ఓ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. తోట లింగయ్యకు బలమైన గాయాలు కావడంతో అతనిని ఐసీయూలో చేర్పించారు.

వైభవంగా ముత్యాలమ్మ తిరునాళ్ల



రాజుపాలెం: మండలంలోని అనుపాలెం గ్రామంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని ముత్యాలమ్మ తిరునాళ్లను మంగళవారం భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. గ్రామస్తులు ముత్యాలమ్మ తల్లికి పొంగళ్లు పొంగించి, మొక్కులు తీర్చుకుని, చీర సారె సమర్పించారు. గ్రామంలోని దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. గ్రామం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. సాయంత్రం తిరునాళ్లలో ఏర్పాటు చేసిన ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ వేణుగోపాల్ బందోబస్తు ఏర్పాటు చేశారు.